


RNI: APTEL/2010/36742

# న్యూస్ వార్
వార్తా పత్రిక



విలేకరులు కావలెను

తెలుగు భాషపై పట్టు స్థానిక సమస్యలపై అవగాహన కలిగిన ఉత్సాహవంతులైన

యువతి యువకులకు జర్నలిస్ట్‌గా పనిచేసేందుకు సదావకాశం

న్యూస్ వార్ దిన పత్రిక

నూతన ఒరవడి ప్రత్యేక కథనాలతో మీ ముందుకు వస్తున్న న్యూస్‌వార్ దిన పత్రికలో

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు,నియోజకవర్గాలు, మండల కేంద్రాలల్లో

వార్తాసేకరణకు విలేకరులు కావలెను ఆసక్తి కలవారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించండి.

94409 91979



నల్లగొండ | epaper.news war.com | గురువారం 4, జూన్ 2026 | సంపుటి :16 సంచిక :65 | ఎడిటర్: కృష్ణారావు నటవ | పేజీలు : 4 , వెల.2.00




## కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే
# శివకుమార్ ప్రమాణస్వీకారం

**బెంగళూరు:** కర్ణాటక ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. లోక్‌భవన్ గ్లాస్ హౌస్‌లో బుధవారం మధ్యాహ్నం 4.05 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్‌తో గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతో పాటు మరో 13 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఆపద్ధర్మ ముఖ్య మంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు వీడీ సతీశన్, ఎ.రేవంత్ రెడ్డి, సుఖ్వీందర్ సింగ్ సుఖు, డీకే శివకుమార్ భార్య ఉషా శివకుమార్, కుమార్తె, పలువురు ఆధ్యాత్మిక నేతలు, విద్యార్థి, పౌరకార్మిక, రైతు ప్రతినిధులు, దళిత నేతలు, కన్నడ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


వార్త 2లో




## తెలంగాణను పెట్టుబడుల
# గమ్యస్థానంగా తీర్చిదిద్దుతాం

- విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక చర్యలు
- పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు
- ఇరు ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు
- తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధి, సాంకేతిక రంగ పురోగతిపై ఆసక్తి
- భవిష్యత్తులో వాణిజ్య, పెట్టుబడి రంగాల్లో మరింత సహకారం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి


2 లో..


తెలంగాణను పెట్టుబడులకు అత్యంత అనుకూల గమ్యస్థానంగా అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డి వ్యాఖ్యానించారు. విదేశీ పెట్టు బడులను ఆకర్షించేందుకు తమ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసు కుంటోందని పేర్కొన్నారు. ఈ రోజు(బుధవారం) సీఎం రేవం త్‌రెడ్డిని.. దక్షిణాఫ్రికా ఉపాధ్య క్షుడు పాలస్ మషటైల్ బృందం ఎం సీహెచ్‌ఆర్డీలో కలిశారు.అధికారిక పర్యట నలో భాగంగా దక్షిణాఫ్రికా బృం దం హైదరాబాద్ వచ్చింది. ఈ సమా వేశంలో పెట్టుబడులపై సీఎం తో.. పాలస్ మషటైల్ బృందం చర్చించింది. ఈ సమా వేశంలో తెలంగాణ ప్రభుత్వం తరపున మంత్రి శ్రీధర్ బాబు, మంత్రి దామో దర రాజనరసింహ, సీఎస్ రామకృష్ణా రావుతో పాటు పలువురు ఉన్నతాధికా రులు పాల్గొన్నారు.



## టీఎంసీలో తిరుగుబాటు.. 59 మంది ఎమ్మెల్యేల సంతకాలతో స్పీకర్‌కు లేఖ

పశ్చిమబెంగాల్‌లోని విపక్ష తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో కీలక పరిణామం చోటుచేసుకుంది. తనకు 59 మంది పార్టీ ఎమ్మెల్యేల మద్దతు ఉందంటూ ఇటీవల పార్టీ నుంచి బహిష్కరణ గురైన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ క్లెయిమ్ చేసుకున్నారు.


2




## హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం.. 21 మంది మృతి

దేశ రాజధాని ఢిల్లీలోని ఓ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిప్రమాదం కారణంగా 21 మంది చనిపోగా.. 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. మల్వియా నగర్‌లోని, హౌజ్ రాణీ లైన్‌లో ఐదంతస్తుల భవనం ఉంది. భవనం బేస్‌మెంట్‌లో 'లెమన్ గ్రీన్ రెస్టారెంట్' ఉంది.


2


## ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడి
# ఇంట్లో ఏసీబీ సోదాలు


2




నగరంలో ఏసీబీ అధికారుల సోదాలు కలకలం రేపుతున్నాయి. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న అడిషనల్ ఎస్పీ భుజంగరావు ఇంట్లో ఈరోజు(బుధవారం) ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. మొత్తం 15 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్నారు. భుజంగరావు బంధువుల ఇళ్లల్లోనూ ఏసీబీ దాడులు కొనసాగుతున్నాయి.



## ఆన్‌లైన్ గేమింగ్ బెట్టింగ్‌లపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు

ఆన్‌లైన్ గేమింగ్ బెట్టింగ్‌లపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నైపుణ్యంతో కూడిన ఆటలైనా సరే.. డబ్బులు పెట్టి బెట్టింగ్ కాస్తే రాజ్యాంగ రక్షణ ఉండదని న్యాయస్థానం తేల్చిచెప్పింది.


2


## తెలంగాణ కచ్చితంగా
# ఇక్కడి భూమి పుత్రుల జాగీరే



ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ కచ్చితంగా ఇక్కడి భూమి పుత్రుల జాగీరే అని స్పష్టం చేశారు. ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్‌ను గౌరవిస్తామని.. సోదరుడిగా ఇంటికి వస్తే.. హైదరాబాద్ బిర్యానీ పెడతామన్నారు. అంతే కానీ.. తమ సచివాలయంలో కూర్చుంటామంటే కుదరదన్నారు.


2


## రాష్ట్ర ప్రజలకు చల్లటి వార్త.. ఇవాళ, రేపు వర్షాలు..




2


ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో ఇవాళ, రేపు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది

## మాదాపూర్ కేబుల్ బ్రిడ్జ్ పై నుంచి దూకి యువతి ఆత్మహత్య

హైదరాబాద్: మాదాపూర్ కేబుల్ బ్రిడ్జ్ పై నుంచి దూకి యువతి ఆత్మహత్య చేసుకుంది. నాగోల్ కు చెందిన రోజా రమణి మాదాపూర్ మెడికవర్ హాస్పిటల్ లో అకౌంటెంట్ గా పని చేస్తున్నారు. నాగోల్ లో తన తల్లిదండ్రులతో కలిసి ఉంటూ మాదాపూర్ మెడికవర్ లో ఉద్యోగం చేస్తున్నారు. తమ కూతురు రోజా రమణి కనబడడం లేదంటూ నాగోల్ పోలీస్ స్టేషన్ లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. నాగోల్ పోలీసులు యువతి మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆర్థిక లావాదేవీలు కారణంగా కేబుల్ బ్రిడ్జి పై నుంచి రోజా రమణి దుర్గం చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. తెలిసినవారికి డబ్బులు ఇచ్చి సమయానికి యువతి లోన్ కట్టలేకపోయింది. మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. యువతి మృతదేహాన్ని బయటకు తీసి గాంధీ ఆస్పత్రికి తరలించారు.

## నోరు ఉందని పవన్ ఇష్టం వచ్చినట్లు
# మాట్లాడితే బాగుండదు: మంత్రి అడ్లూరి లక్ష్మణ్




2 లో..


నోరు ఉందని జనసేన అధినేత, ఎపి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హితవు పలికారు. బుధవారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలో రోడ్లు భవనాలు, పంచాయితీ రాజ్ శాఖ అధికారులతో పుష్కరాల పనులపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు.

# టీఎంసీలో తిరుగుబాటు.. 59 మంది ఎమ్మెల్యేల సంతకాలతో స్పీకర్‌కు లేఖ

కోల్‌కతా: న్యూస్‌వార్ ప్రతినిధి

పశ్చిమబెంగాల్‌లోని విపక్ష తృణమూల్ కాంగ్రెస్ (ఎవీజ)లో కీలక పరిణామం చోటుచేసుకుంది. తనకు 59 మంది పార్టీ ఎమ్మెల్యేల మద్దతు ఉందంటూ ఇటీవల పార్టీ నుంచి బహిష్కరణ గురైన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ క్లెయిమ్ చేసుకున్నారు. తన వర్గం ఎమ్మెల్యేల సంతకాలతో కూడిన లేఖను అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్‌కు బుధవారంనాడు అందజేశారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా రితబ్రత బెనర్జీని, డిప్యూటీ లీడర్లుగా సెయిలీ సాహో, అహ్మద్ ఖాన్ పేర్లను ఈ లేఖలో ప్రతిపాదించారు. దీనికి ముందు టీఎంసీ తిరుగుబాటు ఎమ్మెల్యేలు బస్సులో అసెంబ్లీకి వచ్చారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున తమ బలం చాటుకునేందుకు వారంతా కలిసికట్టుగా వచ్చారు. రెబల్ ఎమ్మెల్యేలకు రితబ్రత నాయకత్వం వహిస్తున్నారు. కాగా, లేఖపై సంతకాలు చేసిన ఎమ్మెల్యేలలో రితబ్రత బెనర్జీ (ఉలుబేరియా పూర్బ), సందీపన్ సహా (ఎంటల్లీ), సబీనా యాస్మిన్ (సుజాపూర్), చంద్రనాథ్ సిన్హా (బోల్పూర్), నియామత్ షేక్ (హరిహర్‌పార), సెయిలీ సాహో (కేశ్‌పూర్), తపస్ మైతీ (దోమ్‌జూర్), అరూప్ రాయ్ (హౌరా మధ్య), ఎండీ గులామ్ రబ్బాని (గోల్పోఖర్), ఉషారాణి మోండల్ (మినాఖాన్), ప్రియాల్ పాల్ (సంక్రయిల్), గుల్షన్ ముల్లిక్ (పాంచ్లా), రతిన్ ఘోష్ (మధ్యంగ్రామ్), సుభాశిష్ దాస్ (మహేష్‌తాల), ముస్తాఫిజుర్ రెహమాన్ (భరత్‌పూర్), అఖ్రుజ్జామన్ (రఘునాథ్‌గంజ్), సమీర్ ముఖర్జీ (రతువా), ప్రసూన్ బెనర్జీ (చంచల్) ఉన్నారు. మరోవైపు, 59 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందంటూ పార్టీ నుంచి సస్పెండయిన రితబ్రత బెనర్జీ క్లెయిమ్ చేసుకోవడం, సంతకాలతో కూడిన లేఖను స్పీకర్‌కు అందజేయడంపై మమతా బెనర్జీ అధికారింగా ఇంకా స్పందించలేదు. అయితే పార్టీ లెజిస్లేటివ్ విభాగం కీలక నియామకాల వివరాలను టీఎంసీ సీనియర్ నేత కల్యాణ్ బెనర్జీ అసెంబ్లీ స్పీకర్‌కు తెలియజేశారు. శోభన్‌దేవ్ ఛటోపాధ్యాయ్‌ను అసెంబ్లీలో విపక్ష నేతగా, ఆషిమా పాత్ర, నయన బందోపాధ్యాయ్ డిప్యూటీ లీడర్లుగా, చీఫ్ విప్‌గా ఫర్హాద్ హకీమ్‌ను పార్టీ నియమించినట్టు తెలియజేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన అభియోగంపై ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందీపన్ సహాలను పార్టీ నుంచి ఇటీవల టీఎంసీ బహిష్కరించింది. ఈ నేపథ్యంలో తమదే అసలైన టీఎంసీ అంటూ రితబ్రత బెనర్జీ స్పీకర్‌కు లేఖ అందజేయడం సంచలనమవుతోంది. టీఎంసీకి 80 మంది శాసనసభ్యులు ఉండగా వీరిలో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ మంది మద్దతు ఉంటే ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం ఆ ఎమ్మెల్యేలపై వేటుపడదు. ఆ ప్రకారం తృణమూల్ కాంగ్రెస్ తిరుగుబాటు వర్గంలో 53 మంది ఎమ్మెల్యేలు తప్పనిసరిగా ఉండాలి. అయితే తనకు 59 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని రితబ్రత బెనర్జీ పేర్కొనడం, స్పీకర్‌ను కలిసి లేఖ ఇవ్వడంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

# హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం.. 21 మంది మృతి

ఇంటర్‌నెట్ డెస్క్: న్యూస్‌వార్ ప్రతినిధి

దేశ రాజధాని ఢిల్లీలోని ఓ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిప్రమాదం కారణంగా 21 మంది చనిపోగా.. 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. మల్వియా నగర్‌లోని, హౌజ్ రాణీ లైన్‌లో ఐదంతస్తుల భవనం ఉంది. భవనం బేస్‌మెంట్‌లో 'లెమన్ గ్రీన్ రెస్టారెంట్' ఉంది. బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మంటల్లో చిక్కుకుని 21 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో హోటల్‌లో 40 మందికి పైగా జనం ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో ఎక్కువ మంది మధ్య ఆసియా, ఆఫ్రికాకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరగడానికి గల కారణాలు తెలియరావాల్సి ఉంది.

### అగ్నిప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

హోటల్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఇస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# ఆన్‌లైన్ గేమింగ్ బెట్టింగ్‌లపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు

ఢిల్లీ, న్యూస్‌వార్ ప్రతినిధి

ఆన్‌లైన్ గేమింగ్ బెట్టింగ్‌లపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నైపుణ్యంతో కూడిన ఆటలైనా సరే.. డబ్బులు పెట్టి బెట్టింగ్ కాస్తే రాజ్యాంగ రక్షణ ఉండదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధిస్తూ తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాలు చేసిన చట్టాలు పూర్తిగా చెల్లుతాయని స్పష్టం చేసింది. ఆన్‌లైన్ జూదాలను నిషేధించే పూర్తి అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే ఉంటుందని వెల్లడించింది. బెట్టింగ్ వ్యాపారం ఎవరికీ 'మౌలిక హక్కు' కాదని ధర్మాసనం తేల్చిచెప్పింది. దీంతో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులకు, గేమింగ్ కంపెనీలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ వంటి యాప్‌లలో డబ్బులు పందెంగా పెట్టడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. గతంలో రాష్ట్ర ప్రభుత్వాల నిషేధ చట్టాలను కొట్టివేస్తూ మద్రాస్, కర్ణాటక హైకోర్టులు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు సమర్థించింది. రాజ్యాంగం ప్రకారం బెట్టింగ్, జూదం అంశాలపై చట్టాలు చేసే సర్వాధికారాలు రాష్ట్రాలకే ఉన్నాయని స్పష్టం చేసింది. ఆట ఆడటానికి నైపుణ్యం అవసరమైనప్పటికీ, దానిపై డబ్బుల పందేలు కాస్తే అది జూదం కిందకే వస్తుందని న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఆన్‌లైన్ వ్యసనాల వల్ల యువత అప్పులపాలై, ఆత్మహత్యలు చేసుకుంటున్న సామాజిక పరిస్థితులను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది. సమాజ హితం, శాంతిభద్రతల దృష్ట్యా ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లపై నిషేధం విధించడం సరైనదేనని న్యాయస్థానం సమర్థించింది. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి మార్గం సుగమమైంది. జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం నుంచి ఈ చరిత్రాత్మక తీర్పు వెలువడింది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడి ఇంట్లో ఏసీబీ సోదాలు

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

నగరంలో ఏసీబీ అధికారుల సోదాలు కలకలం రేపుతున్నాయి. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న అడిషనల్ ఎస్పీ భుజంగరావు ఇంట్లో ఈరోజు(బుధవారం) ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. మొత్తం 15 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్నారు. భుజంగరావు బంధువుల ఇళ్లల్లోనూ ఏసీబీ దాడులు కొనసాగుతున్నాయి. సూర్యాపేటలోనూ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు.. హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో సోదాలు చేస్తున్నారు. ఈరోజు సాయంత్రం వరకు సోదాలు కొనసాగే అవకాశం ఉంది. ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ కేసులో భుజంగరావు కీలక నిందితుడిగా ఉండి అరెస్ట్ అయి జ్యుడిషియల్ రిమాండ్‌కు వెళ్లి ప్రస్తుతం సస్పెండ్‌లో ఉన్నారు. పోలీస్ శాఖలో పనిచేసిన సమయంలో భారీగా ఆస్తులు కూడబెట్టారనే అభియోగం నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో 15 చోట్ల సోదాలు నిర్వహిస్తున్నారు.

# తెలంగాణను పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దుతాం

## విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక చర్యలు

## పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు

## ఇరు ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు

## తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధి, సాంకేతిక రంగ పురోగతిపై ఆసక్తి

## భవిష్యత్తులో వాణిజ్య, పెట్టుబడి రంగాల్లో మరింత సహకారం

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి




హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

తెలంగాణను పెట్టుబడులకు అత్యంత అనుకూల గమ్యస్థానంగా అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు తమ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఈరోజు(బుధవారం) సీఎం రేవంత్‌రెడ్డిని.. దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాలస్ మషటైల్ బృందం ఎంసీహెచ్‌ఆర్డీలో కలిశారు. అధికారిక పర్యట నలో భాగంగా దక్షిణాఫ్రికా బృందం హైదరాబాద్ వచ్చింది. ఈ సమావేశంలో పెట్టుబడులపై సీఎంతో.. పాలస్ మషటైల్ బృందం చర్చించింది. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం తరఫున మంత్రి శ్రీధర్ బాబు, మంత్రి దామో దర రాజనరసింహ, సీఎస్ రామకృష్ణారావుతో పాటు పలువురు ఉన్నతాధికా రులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ, దక్షిణాఫ్రికా మధ్య వాణిజ్య, పారిశ్రామిక, పెట్టుబడి సంబంధాలను మరింత బలోపేతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా సమాచార సాంకేతికత, తయారీ, మౌలిక సదుపాయాలు, ఫార్మా, వ్యవసాయం తదితర రంగాల్లో పరస్పర సహకార అవకాశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్న దక్షిణాఫ్రికా పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు, పారదర్శక పాలన, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ తెలంగాణ ప్రత్యేకతలని వివరించారు. దక్షిణాఫ్రికా కంపెనీలు తెలంగాణలో పరిశ్రమలు స్థాపించడం ద్వారా ఇరు ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని అభిప్రాయపడ్డారు. దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాలస్ మషటైల్ కూడా తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధి, సాంకేతిక రంగ పురోగతిపై ఆసక్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో వాణిజ్య, పెట్టుబడి రంగాల్లో మరింత సహకారం కొనసాగించేందుకు ఇరు పక్షాలు సానుకూలంగా స్పందించాయి.

# తెలంగాణ కచ్చితంగా ఇక్కడి భూమి పుత్రుల జాగీరే

## బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ కచ్చితంగా ఇక్కడి భూమి పుత్రుల జాగీరే అని స్పష్టం చేశారు. ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్‌ను గౌరవిస్తామని.. సోదరుడిగా ఇంటికి వస్తే.. హైదరాబాద్ బిర్యానీ పెడతామన్నారు. అంతే కానీ.. తమ సచివాలయంలో కూర్చుంటామంటే కుదరదన్నారు. బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణకు కేసీఆర్ అని.. వేరే ఎవరూ అవసరం లేదన్నారు.

### ప్రజలుగా కలిసి ఉండాలని కోరుకున్నాం..

'పవన్ కళ్యాణ్.. మీరు ఇక్కడకి రండి.. మీ కుటుంబాలు, వ్యాపారాలు ఇక్కడే ఉన్నాయి. ప్రాంతాలుగా విడిపోయినా.. ప్రజలుగా కలిసి ఉండాలని కోరుకున్నాం. ప్రాంతీయవాదం ఉగ్రవాదంతో సమానమని పవన్ అన్నారు. మద్రాసు నుంచి ఆంధ్ర వేరు పడాలని పొట్టి శ్రీరాములు పోరాడారు. అది కూడా ప్రాంతీయవాదమే అంటారా? మోదీ తన ప్రాంతీయవాదంతో.. తెలంగాణకు వచ్చిన పరిశ్రమలను తరలించుకుపోతున్నారు. జాతీయవాదం ముసుగులో ఆర్థిక ప్రాంతీయవాదం చేయటం సరైందేనా? దీనికి పవన్ కల్యాణ్ సమాధానం చెప్తారా' అని కేటీఆర్ ప్రశ్నించారు.

### దేశంలో ఎవరైనా ఎక్కడైనా పోటీ చేయొచ్చు..

తెలంగాణలో జనసేన కొత్తగా చేసేదేముందని కేటీఆర్ అన్నారు. దేశభక్తి గురించి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. 2023 ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో కూడా జనసేన పోటీ చేసిందని గుర్తుచేశారు. 2018లో చంద్రబాబు కూడా పోటీ చేశారని తెలిపారు. 'పవన్.. తెలంగాణలో పోటీ చేయండి.. ఎవరు వద్దంటున్నారు. ఇక్కడకు వచ్చి అనాయాసంగా మాట్లాడటం సరికాదు. నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు కదం తొక్కిన నేల ఇది. ఆవిర్భావ దినోత్సవం రోజు విభజన తీరు సరిగా లేదని అంటున్నారు. తెలంగాణపై ఉల్టాపల్టా మాటలెందుకు? తెలంగాణ ఏర్పడినప్పుడు 11 రోజులు అన్నం తినలేదని చెప్పారు. తెలంగాణ ఆవిర్భావం రోజు పవన్ సభ పెడతానంటే ఎలా. పవన్ మీటింగ్‌ను అడ్డుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వం' అని తెలిపారు. వందల మంది బలిదానాల రక్తంతో తడిసిన నేల తెలంగాణ అని మాజీ మంత్రి అన్నారు. ఒకటికి రెండు సార్లు ఆలోచించి పవన్ మాట్లాడాలని హితవుపలికారు. ఈ దేశంలో ఎవరైనా ఎక్కడైనా పోటీ చేయొచ్చని తెలిపారు. ఎక్కడైతే పోటీ చేయాలనుకుంటున్నారో ఆ ప్రాంత ప్రజల మనోభావాలు తెలుసుకోవాలని కేటీఆర్ సూచించారు.

### తెలంగాణ కథలో విలన్ కాంగ్రెస్..

పోరాటాలు, త్యాగాలు, బలిదానాలతో తెలంగాణ సాకారమైందని కేటీఆర్ అన్నారు. 1956లో బలవంతంగా ఆంధ్ర, తెలంగాణను కలిపింది కాంగ్రెస్ అని విమర్శించారు. 1969 ఉద్యమంలో 379 మంది ప్రాణాలను బలిగొన్నది కాంగ్రెస్సే అని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమాలను కర్కశంగా అణిచివేసింది కాంగ్రెస్ అని విరుచుకుపడ్డారు. మలిదశ ఉద్యమంలో వేలాది మంది ప్రాణాలను బలిగొన్నది కాంగ్రెస్సే అని అన్నారు. తెలంగాణ కథలో నెంబర్ వన్ విలన్ కాంగ్రెస్సే అని.. తప్పని పరిస్థితుల్లో కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ పోరాటం, దీక్ష లేకపోతే.. తెలంగాణ వచ్చేది కాదన్నారు. కేసీఆర్ హయాంలో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు.




### కరోనా కంటే కాంగ్రెస్ ప్రమాదం..

తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి ఏ రాష్ట్రంలోనూ జరగలేదని మాజీ మంత్రి అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా అని సవాల్ విసిరారు. అమలుకాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ చేసిందేంటి అని ప్రశ్నించారు. అప్పులు చేయడంలో రేవంత్ ప్రభుత్వం రికార్డ్ సృష్టిస్తోందని అన్నారు. రెండున్నరేళ్లలో రేవంత్ ప్రభుత్వం రూ.4లక్షల కోట్ల అప్పులు చేసిందని తెలిపారు. అప్పులపై ఒక్కో మంత్రి.. ఒక్కో లెక్క చెబుతున్నారన్నారు. కరోనా కంటే కాంగ్రెస్ ప్రమాదమని ప్రజలకు అర్థమైందని కేటీఆర్ పేర్కొన్నారు.

# రాష్ట్ర ప్రజలకు చల్లటి వార్త.. ఇవాళ, రేపు వర్షాలు..

హైదరాబాద్: న్యూస్‌వార్ ప్రతినిధి

ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో ఇవాళ, రేపు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. గంటకు 50 నుంచి 60 కి.మిల వేగంతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. బుధవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు నిజామాబాద్, నల్గొండ, సూర్యపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్ధిపేట జిల్లాలకు అరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్‌తో పాటు యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గురువారం ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, జిల్లాలతో పాటు నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, నిజామాబాద్ జిల్లాలకు అరెంజ్ అలర్ట్, ఉమ్మడి ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, మహబూబ్‌నగర్‌తో పాటు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, జనగామ, సిద్ధపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

# నోరు ఉందని పవన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే బాగుండదు: మంత్రి అడ్లూరి లక్ష్మణ్

వెల్గటూర్:

నోరు ఉందని జనసేన అధినేత, ఎపి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హితవు పలికారు. బుధవారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలో రోడ్లు భవనాలు, పంచాయితీ రాజ్ శాఖ అధికారులతో పుష్కరాల పనులపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై



మంత్రి స్పందించారు. తెలంగాణ మీ అయ్య జాగీరా అంటూ పవన్ చేసిన వ్యాఖ్యలను మంత్రి తీవ్రంగా ఖండించారు. నోరు ఉందని పవన్ కళ్యాణ్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే బాగుండదని హెచ్చరించారు. పవన్ కళ్యాణ్ సభకు అనుమతిపై ప్రభుత్వా నిబంధనల ప్రకారం సభ నిర్వహణకు అనుమతి ఇస్తారని మంత్రి తెలియజేశారు. పవన్ కళ్యాణ్ ను హీరోగా అందరూ అభిమానిస్తారన్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రజలు అన్నదమ్ములు లాగా కలిసి ఉంటున్నారని అన్నారు. భారత దేశంలోనే తెలంగాణ ప్రజలకు ఉన్న మంచి మనసు ఎవరికీ ఉండదన్నారు. తెలంగాణ ప్రజలు దయా గుణంతో ఉంటారని వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మరో మారు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని అడ్లూరి జోస్యం చెప్పారు. గత ప్రభుత్వ కాలంలో పుష్కరాల పనులు ఆలస్యంగా ప్రారంభించడం వల్ల భక్తులు ఇబ్బంది పడ్డారని తెలియజేశారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ఏడాది ముందుగానే పుష్కరాల పనులు ప్రారంభించి సకల సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని మంత్రి వివరించారు.

న్యూస్ వార్
వార్తా పత్రిక

సంపాదకీయం...

# పరీక్షల నిర్వహణలో అస్తవ్యస్తం

**సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) 12వ తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో అనేక లోపాలు, తేడాలు బయటపడడం దేశవ్యాప్తంగా అలజడి సృష్టిస్తోంది. నీట్ ప్రశ్నపత్రాల లీక్ సంఘటన మరువక ముందే సిబిఎస్ఇ 12వ తరగతి ఫలితాలు వివాదాస్పద చర్చకు దారితీస్తున్నాయి. సిబిఎస్ఇ కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఒఎస్ఎం) వల్లనే ఈ గందరగోళం ఏర్పడింది. జాతీయ స్థాయి పరీక్షలైన క్యూట్‌యుజి (కామన్ యూనివర్శిటీ ఎంట్రన్స్ టెస్ట్) వల్ల విద్యార్థులు వేర్వేరు విశ్వవిద్యాలయాలకు ప్రత్యేకంగా ఎంట్రన్స్ పరీక్షలు రాయవలసిన అవసరం లేకుండా ఒకే పరీక్ష ద్వారా దేశంలోని అత్యుత్తమ యూనివర్శిటీల్లో సీట్లు పొందగలుగుతారు. అయితే క్యూట్‌లో ఎదురవుతున్న సాంకేతిక లోపాలు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ, సిబిఎస్ఇల్లో పదేపదే జరుగుతూ విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చివేస్తున్నాయి. సిబిఎస్ఇ 12వ తరగతి పరీక్షల ఫలితాలను పరిశీలిస్తే ఉత్తీర్ణత శాతం గత ఏడాది 88.39 శాతం ఉండగా, ఈ ఏడాది 85.29 శాతానికి దిగజారింది. 90 శాతం కన్నా స్కోరు సాధించిన విద్యార్థుల సంఖ్య కూడా బాగా తగ్గింది.**

దీంతో చాలా మంది విద్యార్థులు తాము ఆశించిన విధంగా ఫలితాలు రాకపోవడంతో మూల్యాంకనం కోసం ఆశ్రయించారు. 4 లక్షలకు మించి విద్యార్థులు జవాబు పత్రాల స్కానింగ్ కాపీలు కావాలని అభ్యర్థించారంటే ఎంత మంది ఈ ఫలితాలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారో తెలుస్తోంది. ఫిబ్రవరి 17న ఈ 12వ తరగతి పరీక్షలు జరగ్గా, ఈ పరీక్షలకు కేవలం పదిరోజులకు ముందుగా ఆన్‌లైన్ స్క్రీన్ మార్కింగ్ అమలు గురించి ఉపాధ్యాయులకు తెలియజేయడం విడ్డూరం. ఈ కొత్త పద్ధతిపై ఉపాధ్యాయులకు ఎంతవరకు అవగాహన ఉంది? వారు స్కానింగ్ చేసిన జవాబు పత్రాలను డిజిటల్ ప్రక్రియలో దిద్దగలరా? స్కానింగ్ కాపీలు స్పష్టంగా ఉంటున్నాయా? ఇవేవీ పరిశీలించకుండానే హడావిడిగా అమలు చేయడం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కూడా ఇదో అగ్నిపరీక్షగా తయారై అనేక లోపాలు పుట్టుకొచ్చాయి. ఫిబ్రవరి 9న సిబిఎస్ఇ జారీ చేసిన సర్కులర్‌లో ఆన్‌లైన్ స్క్రీన్ మార్కింగ్ ప్రక్రియ వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని వివరించింది. పరీక్షలు.. ప్రహసనాలు తప్పులు పూర్తిగా తొలగించవచ్చని, మానవ సహాయం చాలావరకు తగ్గుతుందని, మూల్యాంకనం అంటే పేపర్లు దిద్దడం చాలా వేగంగా జరుగుతుందని, ఫలితాలు వెలువడిన తరువాత తిరిగి పరిశీలించవలసిన అవసరం రాదని ఇలా ఎన్నెన్నో పేర్కొంది. కానీ ఆచరణాత్మకం వాటికి భిన్నంగా ఫలితాలు కనిపించాయి. 17 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారు. అంటే వీరికి 98 లక్షల జవాబు పత్రాల పుస్తకాలు అందించారు. అంటే 40 కోట్ల పేజీలు ఇచ్చినట్టు. ఇవన్నీ మాన్యువల్‌గా రికార్డు సమయానికి స్కానింగ్ చేయవలసి ఉంటుంది. మూల్యాంకనం కోరిన వారికి ఇవన్నీ పరిశీలించవలసి ఉంటుంది. దీనికి తగిన కనీస మౌలిక అవసరాలు, కంప్యూటర్లు, లాకింగ్ సిస్టమ్ తదితర సాంకేతికత సరిగ్గా లేక గందరగోళం ఏర్పడి తప్పుల కుప్పలు కనిపిస్తున్నాయి. అంటే సిబిఎస్ఇ పరీక్షల నిర్వహణ ఎంత లోపభూయిష్టంగా ఉందో స్పష్టమవుతోంది. స్కానింగ్ వ్యవస్థ పూర్తిగా అందుబాటులోకి రాకుండా ఆన్‌స్క్రీన్ మార్కింగ్ ప్రక్రియను ఎందుకు సిబిఎస్ఇ ప్రవేశపెట్టిందో అర్థంకావడం లేదు. ఇది క్షమించరానిది. ఇది తాత్కాలిక సర్దుబాటుగా సిబిఎస్ఇ చెబుతున్నా సక్రమంగా అంతవరకు ఉన్న వ్యవస్థను నాశనం చేసినట్టే. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? ఈ లోపాలపై ఎవరు దర్యాప్తు చేస్తారు? లోక్‌సభ విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఈ ఆన్‌లైన్ స్క్రీన్ మార్కింగ్ వ్యవస్థ వల్ల మూల్యాంకనం తప్పులు, అక్రమాల పుట్టగా తయారైందని ధ్వజమెత్తారు. సిబిఎస్ఇలో జేబుదొంగలున్నారు జాగ్రత్త! అని విద్యార్థులను హెచ్చరించారు. సిబిఎస్ఇ పొరపాటు వల్ల మార్కులు తప్పుగా వస్తే, దానికి మీకు బిల్లుపడుతుందన్నారు. డిజిటల్ స్కాన్ కాపీ తీసుకోవాలంటే ఒక సబ్జెక్టుకు రూ. 100, ఒక పేపర్ రీటోటలింగ్‌కు రూ. 100, రీ ఎవాల్యుయేషన్ చేయించుకోవాలంటే ఒక ప్రశ్నకు రూ. 25, మొత్తంగా ఒక విద్యార్థి తన జవాబు పత్రాన్ని సరిగ్గా దిద్దించుకోవడానికి దాదాపు రూ. 2000 చెల్లించవలసి రావచ్చన్నారు. మొత్తం 4 లక్షల మంది విద్యార్థులు మూల్యాంకనం కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు సిబిఎస్ఇ ఎంత సొమ్ము ఆర్జిస్తోందో గమనించాలని విద్యార్థులకు సూచించారు. ఇదంతా శిక్ష పడుతున్నది విద్యార్థులకు, ఆదాయం ప్రభుత్వానికి అని ఎద్దేవా చేశారు. ఇదిలా ఉండగా ఈ పరీక్షల నిర్వహణకు ఎడ్యుటెక్ అనే సంస్థను సిబిఎస్ఇ ఎంపిక చేయడాన్ని ఆక్షేపించారు. తెలంగాణలో గ్లోబరేనా అనే పేరుతో ఈ సంస్థ 2019, 2023లో స్కామ్‌కు పాల్పడిందని, అలాంటి రికార్డు ఉన్న సంగతి సిబిఎస్ఇకి తెలియదా? అని ప్రశ్నించారు. ఈ కంపెనీ రికార్డు తెలిసినా దీన్ని ఎంచుకోవడంలో ఏదో



నిగూఢమైన కారణం ఉందని ఆరోపించారు. అయితే ప్రభుత్వ ప్రొక్యూర్‌మెట్ పాలసీ ప్రకారమే ఈ కంపెనీని ఎంపిక చేసినట్టు సిబిఎస్ఇ వెల్లడించింది. అయితే జవాబు పత్రాల మూల్యాంకన పోర్టల్‌లోని లోపాలను వినియోగదారులు బయటపెట్టడంతో సిబిఎస్ఇ వాటిని అంగీకరించడమే కాక, ఈ కంపెనీపై జరిమానా విధించడానికి సిద్ధమైనట్టు తెలుస్తోంది. విద్యార్థులు తమ బాల్యం లోని మంచి దశను, వారి ఆత్మస్థైర్యాన్ని నాశనం చేసే బోర్డు, ప్రవేశ పరీక్షల కోసం త్యాగం చేయవలసి వస్తోందని పరీక్షల నిర్వాహకులు తెలుసుకోవాలి. యువత తమ కెరీర్, ఉన్నత చదువుల కోసం రాసే ఈ ప్రవేశ పరీక్షల ఒత్తిడి, పోటీ కారణంగా వారు స్వేచ్ఛను కోల్పోయి, పరీక్షలకే పరిమితమవుతున్నారు. ఇది విద్యార్థి తరానికి జరిగిన ఒక బాధాకరమైన, నిరాశపరిచే నమ్మకద్రోహం.

# అకాల వర్షాలతో రైతులు కన్నీరు

## తడిసి ముద్దవుతున్న వరి ధాన్యం

## ధాన్యం కుప్పల చుట్టూ వర్షపు నీరు



**హైదరాబాద్,**

ఆరుగాలం కష్టపడి పండించిన పసిడిపంట చేతికొచ్చే సమయానికి అన్నదాతను ప్రకృతి పగబట్టి ఆడుకుంటోంది. ఉదయం పూట భగభగ మండుతున్న ఎండలు కమ్మేస్తుంటే.. రాత్రి కాగానే విరుచుకుపడుతున్న కారుమబ్బులు, భయపెడుతున్న ఈదురుగాలులు, అకాల వర్షాలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాతావరణం పూర్తిగా అతలాకుతలమైంది. పగలు దంచికొడుతున్న ఎండల తీరు ఒకలా ఉంటే రాత్రివేళ ముంచుకొస్తున్న అకాల వర్షాలు రైతన్నల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రకృతి కన్నెర్ర చేయడంతో స్వేదం చిందించి పండించిన ధాన్యం రాశులు కళ్ల ముందే తడిసిపోతుంటే ఆ దృశ్యాలు చూసి కర్షకులు



కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ విభిన్న వాతావరణ పరిస్థితులు జిల్లావ్యాప్తంగా రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. కల్లాల్లో, వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ధాన్యం విక్రయించడానికి వచ్చిన కర్షకులు చెప్పనలవికాని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ కొనుగోలు ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో పగలు రాత్రి కష్టపడి సాధించిన దిగుబడులను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. రోజుల తరబడి మార్కెట్ యార్డుల్లోనే పడిగాపులు కాస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. కల్లాల వద్ద, రోడ్ల పక్కన కుప్పలు పోసిన ధాన్యం వర్షానికి తడవకుండా ప్లాస్టిక్ కవర్లు కప్పుతూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నారు. రోడ్లపైనే వరి కుప్పలు భారీగా పేరుకుపోవడంతో అటు వాహనదారులకు సైతం ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. గత రెండు మూడు రోజులుగా విరామం లేకుండా కురుస్తున్న అకాల వర్షాలకు జిల్లాలోని సాత్నాల, బేలా, జైనథ్, భోరజ్ మండలాల్లో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మార్కెట్ కేంద్రాల వద్ద ఆరుబయట నిల్వ ఉంచిన ధాన్యం కుప్పల చుట్టూ వర్షపు నీరు వాగుల్లా ప్రవహించడంతో వడ్లు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. ముఖ్యంగా తాంసి మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్ ఆరబోసిన జొన్న పంటతో, నిస్సహాయ స్థితిలో ఉన్న రైతులతో కిటకిటలాడుతోంది. కంటికి రెప్పలా కాపాడుకున్న జొన్న కుప్పలు అడపాదడపా కురుస్తున్న వానలకు తడిసిపోతుండటంతో వాటిని పదేపదే ఎండబెట్టుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమిస్తూ అలిసిపోతున్నారు. కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగడానికి ప్రధానంగా గన్నీ బ్యాగులు, లారీలు, హమాలీల కొరత కారణమని స్పష్టమవుతోంది. నిండిన బస్తాలను తరలించేందుకు లారీలు సకాలంలో రాకపోవడం, తూకాలు వేసేందుకు తగినంత మంది కూలీలు దొరకకపోవడంతో కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం పదిహేను ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు.. ఇప్పటి వరకు సుమారు రెండు లక్షల క్వింటాళ్ల వరిని మాత్రమే కొనుగోలు చేయగలిగారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఏమాత్రం పరిష్కారం కాకపోవడంతో వారం రోజులు గడిచినా రైతుల నిరీక్షణ యథాతథంగా కొనసాగుతూనే ఉంది. బస్తాల కొరత అన్నదాతల పాలిట పెను శాపంగా మారింది. క్షణం క్షణం మారుతున్న వాతావరణ పరిస్థితులు, అధికారుల నిర్లక్ష్యం వెరసి రైతుల సహనాన్ని తీవ్రంగా పరీక్షిస్తున్నాయి. పగలు ఎండకు ఎండుతూ, రాత్రి వానకు తడుస్తూ దిక్కుతోచని స్థితిలో ఉన్న కర్షకులు చివరికి తమ ఆగ్రహాన్ని ప్రదర్శిస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని డిమాండ్ చేస్తూ పలుచోట్ల రోడ్డెక్కి ధర్నాలు, ఆందోళనలు చేపట్టారు. వాన ఎప్పుడు ముంచుకొస్తుందో, గాలి దుమారం ఎప్పుడు కమ్ముకొస్తుందో తెలియని అయోమయ పరిస్థితుల్లో అధికారులు తక్షణమే స్పందించాలని వారు వేడుకుంటున్నారు. లారీలు, గోనెసంచులు తగినన్ని అందుబాటులో ఉంచి, నిబంధనలు సడలించి తడిసిన పంటను సైతం వెంటనే కొనుగోలు చేసి తమను తక్షణమే ఆదుకోవాలని రైతన్నలు ముక్తకంఠంతో ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# పుష్కరాలకు పకడ్బందీగా ఏర్పాట్లు

## భక్తులకు లోటు రాకుండా చర్యలు చేపట్టాలి

## పుష్కరాల ఏర్పాట్లపై చంద్రబాబు సమీక్ష

**అమరావతి,**

పుష్కరాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలని సిఎం చంద్రబాబు అన్నారు. భద్రత, ట్రాఫిక్, పారిశుధ్యంపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. గోదావరి పుష్కరాలు–2027 ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు నాయుడు మంగళవారం సమీక్ష నిర్వహించారు. వెలగపూడి సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘంతో కీలక సమావేశం నిర్వహించారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. పుష్కరాల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. పుష్కరాల కోసం మౌలిక వసతుల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. నీటి వనరులు, రోడ్లు, ఆరోగ్య శాఖల సమన్వయంపై సమావేశంలో చర్చించారు. పుష్కర ఘాట్ల అభివృద్ధిపై అధికారులతో సీఎం సమీక్ష జరిపారు. పుష్కరాల నిర్వహణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశానికి ఎండోమెంట్స్ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి , నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, హోం మంత్రి వంగలపూడి అనిత, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరవగా.. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వర్చువల్‌గా హాజరయ్యారు. అలాగే సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, గోదావరి పుష్కరాల నోడల్ అధికారి వీరపాండియన్ సమీక్షకు హాజరయ్యారు.

# రాష్ట్రాలు రెండయినా జాతి ఒక్కటే

## తెలంగాణ ఆవిర్భావ శుభాకాంలు తెలిపిన సిఎం, డిప్యూటి సిఎం

**అమరావతి,**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రాంతాలుగా రెండు రాష్ట్రాలు ఏర్పడినా.. తెలుగుజాతి అంతా ఎప్పటికీ ఒక్కటే అని సీఎం అన్నారు. మూడున్నర కోట్ల మంది ప్రజల ఆశలు, ఆకాంక్షలతో యువత బలిదానాలతో సిద్ధించిన రాష్ట్రం తెలంగాణ అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 'తెలుగు ప్రజలకు రెండు రాష్ట్రాలు ఏర్పడి నేటికి 12 ఏళ్లు. ప్రాంతాలుగా రెండు రాష్ట్రాలు ఏర్పడినా... తెలుగు జాతి అంతా ఎప్పటికీ ఒక్కటే. అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో పోటీ పడి దూసుకుపోవాలి. ఎంతో చరిత్ర, సాంస్కృతిక నేపథ్యం ఉన్న తెలుగు గడ్డ భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలి. తెలంగాణ రాజధాని హైదరాబాద్, ఏపీ రాజధాని అమరావతి ప్రపంచంలోనే అత్యుత్తమ నగరాలుగా వెలగాలి. ప్రతి తెలుగు కుటుంబానికి అభివృద్ధి ఫలాలు దక్కాలి. అత్యుత్తమ జీవన ప్రమాణాలు పొందాలి. వికసిత్ భారత్ 2047 లక్ష్యంలో మన రెండు రాష్ట్రాలు కలిసి పని చేసి, కీలక భూమి పోషించి తెలుగు వైభవాన్ని, ప్రాభవాన్ని చాటాలి' అంటూ సీఎం చంద్రబాబు పోస్ట్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఏపీ డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. 'మూడున్నర కోట్ల మంది ప్రజల ఆశలు, ఆకాంక్షలతో యువత బలిదానాలతో సిద్ధించిన రాష్ట్రం తెలంగాణ. ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించి పుష్కర కాలం పూర్తయిన సందర్భంగా యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు. జనసేన ఊపిరులూదుకున్నది తెలంగాణ గడ్డపైనే. ఈ నేల నుంచే వారసత్వంగా పోరాట పటిమను పుణికి పుచ్చుకున్నది. అణగారినవర్గాల సంక్షేమం, యువత ఆకాంక్షలు, వ్యక్తి స్వేచ్ఛకు విఘాతం కలిగితే గళం వినిపించే తెగువ తెలంగాణలో ఉంది. అటువంటి లక్షణం జనసేన శ్రేణుల్లోనూ నిండుగా ఉంది. ఘనమైన చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపద విలసిల్లే తెలంగాణ రాష్ట్రం సమున్నతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నాను. తెలంగాణ కోసం బలిదానం చేసిన ప్రతి ఒక్కరికీ అంజలి ఘటిస్తున్నాను' అంటూ పవన్ కల్యాణ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# అభివృద్ధిపై జగన్ నీతులు విడ్డూరం

## అమరావతిపై విషం చిమ్ముతూనే ఉన్నారు

## మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**అమరావతి**

రాజధాని అమరావతిపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ అనుసరిస్తున్న వైఖరిపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రాజధాని అమరావతిలో మంత్రి మాట్లాడుతూ.. అమరావతి గురించి వైఎస్ జగన్ చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా బాధ్యతారాహిత్యమైనవన్నారు. ప్రపంచ స్థాయి రాజధానిని ఐదేళ్ల పాలనలో అల్లకల్లోలం చేసింది గత వైసీపీ ప్రభుత్వమేనని ఆయన గుర్తు చేశారు. రాజధాని నిర్మాణాన్ని అర్ధంతరంగా నిలిపివేసి ఇప్పుడు అభివృద్ధిపై నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందంటూ జగన్ తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అయోమయంలోకి నెట్టి.. ఇప్పుడు మావిగన్ అంటూ మాయ మాటలు చెప్తున్నారంటూ జగన్‌పై మంత్రి రాంప్రసాద్ రెడ్డి నిప్పులు చెరిగారు. అమరావతి రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కింది గత వైసీపీ పాలనలోనే అని విమర్శించారు.

# మహిళను మాటల్లో పెట్టి గొలుసు చోరీ

**హైదరాబాద్,**

నగరంలో చైన్ స్నాచర్ రెచ్చిపోయాడు. కూరగాయాల కోసం బయటకు వెళ్లిన మహిళతో ఓ వ్యక్తి మాటలు కలిపి అకస్మాత్తుగా ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కుని పరారయ్యాడు. అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగి ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. రత్నమాల అనే మహిళ కూరగాయలు కొనుగోలు చేసి ఇంటికి తిరిగి వెళ్తోంది. దుర్గాబాయి దేశ్ ముఖ్ కాలనీలోని వేదశ్రీ అపార్ట్‌మెంట్‌లో తన నివాసంలోకి అడుగు పెట్టగానే ఓ గుర్తు తెలియని వ్యక్తి కాలినడకన ఆమె వద్దకు వచ్చాడు. మహిళతో కాసేపు మాట్లాడిన నిందితుడు.. ఒక్కసారిగా ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని అక్కడి నుంచి పరారయ్యాడు. దుండగుడి చర్యతో మహిళ షాక్‌కు గురైంది. దొంగలించిన గొలుసు సుమారు రెండున్నర తులాలు ఉంటుందని అంచనా. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటన జరిగిన సమయంలో నిందితుడు హెల్మెట్ ధరించి ఉన్నట్లు తెలుస్తోంది. దుండగుడి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.

న్యూస్ వార్
వార్తా పత్రిక

### నల్లగొండ జిల్లా చిన్న పత్రికల

## సంఘ జిల్లా కార్యదర్శిగా న్యూస్ వార్ ఎడిటర్ నటవ కృష్ణారావు

**నల్గొండ మే 3 (న్యూస్ వార్)**



నకిరేకల్ పట్టణంలోని వినాయక బ్యాంక్వెట్ హాలులో రాష్ట్ర అధ్యక్షులు విరహతలి ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ, జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి పర్యవేక్షణలో, జరిగిన టీయూడబ్ల్యూజే ( ఐజేయు) చిన్న పత్రికల సంఘం జిల్లా కమిటీకి సంబంధించి జిల్లా కార్యదర్శిగా న్యూస్ వార్ ఎడిటర్ నటవ కృష్ణారావు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పి. ప్రభాకర్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కృష్ణారావు మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఐజేయు సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ, క్షేత్రస్థాయిలో చిన్న పత్రికల నిర్వహణలో ఎదుర్కొంటున్న ఇబ్బందులపై నిరంతరం పోరాడతామని సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని, యూనియన్ అండదండలతో చిన్న పత్రికల నిర్వాహకులకు విలేకరులకు భరోసా కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.?ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు సీనియర్ జర్నలిస్టులు, సంఘం నాయకులు పాల్గొని నూతనంగా ఎన్నికైన వివిధ విభాగాల కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు.

## టియూడబ్ల్యూజే (ఐజేయూ) నల్లగొండ జిల్లా అధ్యక్ష,కార్యదర్శుల ఎన్నిక




**నల్గొండ మే 3 (న్యూస్ వార్)**

నకిరేకల్ పట్టణంలోని వినాయక బ్యాంక్వెట్ హాలులో రాష్ట్ర అధ్యక్షులు విరహతలి ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ, ఆధ్వర్యంలో టియూడబ్ల్యూజే (ఐజేయూ) నల్లగొండ జిల్లా అధ్యక్షులుగా గార్లపాటి కృష్ణారెడ్డిని అలాగే జిల్లాప్రధాన కార్యదర్శిగా పులిమామిడి మహేందర్ రెడ్డిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులకు ప్రధాన కార్యదర్శిని పలువురు జర్నలిస్టులు, సంఘం నాయకులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు.

## నల్లగొండ జిల్లా చిన్న పత్రికల సంఘం కమిటీ ఎన్నిక

**నల్గొండ జూన్ 3 (న్యూస్ వార్)**

టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా మహాసభ నకిరేకల్ లో బుధవారం నిర్వహించడం జరిగింది. ఇట్టి మహాసభలో జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి నల్లగొండ జిల్లా చిన్న పత్రికల సంఘం జిల్లా కమిటీని ప్రకటించడం జరిగింది. జిల్లా గౌరవ అధ్యక్షులుగా గంగాధర వెంకటేశ్వర్లు,జిల్లా అధ్యక్షులుగా అబ్బోజు మదనాచారి, జిల్లా ఉపాధ్యక్షులుగా




ఇమ్మడి పాక వెంకన్న, గుడిపాటి శ్రీనివాసులు ,ఎండి షరీఫ్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పిట్టల రామకృష్ణ, సహాయ కార్యదర్శులు గా ఎ .జగదీశ్వర చారి, ఎన్ కృష్ణారావు, మహమ్మద్ యజాసోద్దీన్, జిల్లా కోశాధికారి గా పొట్టుముత్తు అశోక్, కార్యవర్గ సభ్యులుగా ఘా.శంకర్ రెడ్డి, కుదుస్. గౌరవ సలహాదారులు కంది సూర్యనారాయణ ఎన్నికైనట్టు మహాసభలో ప్రకటించారు.

# చిన్న పత్రికలకు అక్రిడేషన్ ఇవ్వడంలో జాప్యాన్ని నివారించండి

**నకిరేకల్ మే 3 (న్యూస్ వార్ )**

నకిరేకల్ లో జరుగుతున్న టీయూడబ్ల్యూజే ఐజేయు నల్గొండ జిల్లా మహాసభలో చిన్న పత్రికల ఎడిటర్లు అన్ఎంప్యానల్ పిరియాడికల్స్ కు అక్రిడేషన్ ఇవ్వడంలో ఐఎన్డపిఆర్ చేస్తున్న జాప్యాన్ని నివారించాలని టీయూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీకి వినతి పత్రం ఇస్తూ అక్రిడేషన్ లేకపోవడం వల్ల వార్తలు సేకరించడంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అయినప్పటికిని క్రమం తప్పకుండా పత్రిక ముద్రణ నిర్వహిస్తున్నామని దీనిని గుర్తించిన ఐ ఎన్ పి ఆర్ తమను అక్రిడేషన్ కోసం అప్లై చేసుకోమని వెబ్సైట్లో అవకాశం కల్పించి తీరా అప్లై చేసుకున్న తర్వాత తమ అప్లికేషన్లను గుర్తించకపోవడంపై తీవ్ర మనోవేదన వ్యక్తం చేస్తూ యూనియన్ అధ్యక్షునిగా చరవ తీసుకొని కమిషనర్ తో మాట్లాడి తమ సమస్యను పరిష్కరించవలసిందిగా నటవ కృష్ణారావు న్యూస్ వార్ ఎడిటర్, ఎండి ఎజాసుద్దీన్ ప్రజాశాంతి ఎడిటర్, ఎండి కుద్దూస్ మన చరిత్ర ఎడిటర్, నాగేశ్వరరావు ఫోటో పత్రిక, ఎం వీరబ్రహ్మం వారు సమర్పించిన వినతిపత్రంలో కోరారు.




# నల్గొండ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా టీయూడబ్ల్యూజే(ఐజేయు) నూతన కార్యవర్గ ఎన్నిక

**నల్గొండ మే 3 (న్యూస్ వార్)**

నకిరేకల్ పట్టణంలోని వినాయక బ్యాంక్వెట్ హాలులో జరిగిన టీయూడబ్ల్యూజే ( ఐజేయు) జిల్లా మహాసభలో జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.?ఈ ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర అధ్యక్షులు విరహతలి ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ, జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి పర్యవేక్షించగా, ఎలక్ట్రానిక్ మీడియా విభాగానికి నల్లగొండ ?జిల్లా అధ్యక్షులుగా పరమేష్ ( హెచ్ఎంటీవీ స్టాఫ్ రిపోర్టర్) ?ప్రధాన కార్యదర్శిగా దోటి శ్రీనివాసులు ( సివిఆర్ స్టాఫ్ రిపోర్టర్) ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పి. ప్రభాకర్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు.?ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు పరమేష్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఐజేయు సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ, క్షేత్రస్థాయిలో విలేకరులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై నిరంతరం పోరాడతామని సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని, యూనియన్ అండదండలతో ప్రతి జర్నలిస్టుకు భరోసా కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.?ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు సీనియర్ జర్నలిస్టులు, సంఘం నాయకులు పాల్గొని నూతనంగా ఎన్నికైన వారికి అభినందనలు తెలియజేశారు.



# పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలి

## చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు తాడూరు పరమేష్

**చౌటుప్పల్ మే 3 (న్యూస్ వార్)**

తెలంగాణ ప్రజలను రెచ్చగొట్టే విధంగా, "మీ అయ్యా జాగీరా" అంటూ మాట్లాడిన జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ వెంటనే తెలంగాణ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు తాడూరి పరమేష్, మాజీ అధ్యక్షులు ఉడుగు శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం కోట్లాది మంది ప్రజల త్యాగాలు, ఉద్యమాలు, పోరాటాల ఫలితంగా సాధించుకున్న స్వప్నమని పేర్కొన్నారు. అలాంటి తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా, ప్రజల మనోభావాలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని అన్నారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు సంయమనంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని, ప్రాంతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడటం సమంజసం కాదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల గౌరవాన్ని కించపరిచే ఏ వ్యాఖ్యనైనా తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. పవన్ కళ్యాణ్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల ఆత్మాభిమానాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను భవిష్యత్తులో పునరావృతం చేయవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పిట్టల బిక్షమయ్య ,జాయింట్ సెక్రెటరీ మక్తాల నరసింహ గౌడ్, స్పోర్ట్స్ అండ్ కల్చర్ సెక్రటరీ దేశ బోయిన శ్రీశైలం యాదవ్, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ ఎండి కయుంపాషా, మాజీ లైబ్రరీ కార్యదర్శి శేఖర్, న్యాయవాదులు బడుగు శ్రీకాంత్, చామట్ల జంగయ్య , గర్దాసు రాఘవేందర్, కట్టెల లింగస్వామి, సిలువేరు మల్లికార్జున్ న్యాయవాదులు పాల్గొన్నారు.



Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,